

# లంకల్లపుట్టింది లచ్చితల్లి

ఉదయం తొమ్మిది గంటలవేళ లంకకు పోవడానికి పశువుల్ని విప్పుతున్నారు జీతగాళ్ళు. పలుపులు విప్పీ విప్పడం తోటే రంకెలు వేసుకుంటూ అంబారవాలు చేసుకుంటూ వీధుల్లో కొస్తున్న ఆవులు, గేదెల వెనకాలే చెంగున ఎగురుతూ దూడలు ఉరకలేస్తున్నాయి. వాకిళ్ళలోని సంక్రాంతి గొబ్బెమ్మల్ని తొక్కుకుంటూ వీధిలోని మిగతా పశువుల్ని పలకరించుకుంటూ ఆంజనేయస్వామి రేవు వైపు దారితీశాయి. పశువులు వెళ్ళిపోవటంతోటే కన్నె ముత్తయిదువులు ఆ గొబ్బెమ్మల్ని తీసికెళ్ళి గోడలకి కొట్టున్నారు. రథసప్తమికి ఆ పిడకలతో పాలు పొంగించాలి.

ఆంజనేయస్వామి రేవులో వందలాది పశువులు, పడవలరేవు పక్కగా ఒక్కొక్క తండా గుభిల్లున కృష్ణలో దూకుతున్నాయి. మోరలు నీళ్ళలో ముంచి గభీమని పైకి తేలుతున్నాయి. ఆ తాకిడికి పెద్ద పెద్ద అలలు విసురుగా వచ్చి వొడ్డుకి కొట్టుకొని విరిగిపోతున్నాయి. పశువులు మోరలు నీళ్ళల్లో ముంచి మళ్ళీ పైకి తేల్తూ బుసలుపెడ్తున్నాయి. తోకలతో వొళ్ళు బాదుకుంటున్నాయి. వాటికి రేవు చూడగానే నీళ్ళలో దిగగానే ఎక్కడలేని ఆవేశం.

ఒడ్డున పాలేళ్ళు పుట్టగోచీలు పెట్టుకుంటున్నారు. బువ్వ మూటలు తలమీద పెట్టుకొని ధోవతులు తలపాగగా చుట్టుకుంటున్నారు. 'ఒరేయ్ పోలాయ్!' 'ఒరేయ్ వీరాయ్!' అంటూ అన్ని వీధుల పాలేళ్ళని పలకరించుకుంటున్నారు. ఆపైన తెప్ప కొయ్యల్ని నీళ్ళలో వేశారు. తెప్ప కొయ్యల బొరియల్లో పురుగూ

పుట్రా వుంటే కొట్టుకు పోవటానికి నీళ్ళలో రెండుమూడుసార్లు ముంచి పైకి తేల్చారు. "ఏరా పోదామా! అంటే పోదామా!' అనుకున్నారు. మంద నంతనీ ప్రవాహంలోకి తోలారు. ఒక్కో తెప్పకొయ్యమీద ఇద్దరేసి పడుకొని ఈదుతున్నారు. కొందరు ఆవు తోకలు పట్టుకుని ఈదుతున్నారు. గేదె తోకలు పట్టారు. మందలో అటూ ఇటూ బెదిరిపోతున్న పశువుల వైపు 'రయ్ రయ్' మని ఈదుకుంటూ వెళ్ళి తిరిగి మందలో కలుపుతున్నారు. అలా వందలాది పశువులు ప్రవాహంలో ఈదుకుపోతుంటే పశువుల తెప్ప కృష్ణలో కదలి పోతున్నట్లుంది. ఆ తెప్ప వెనక ధారల్లా తెప్ప కొయ్యలమీద పాలేళ్ళు మధ్యలో ఇసక తిన్నె. ఆ ఇసకతిన్నె దాటితే మరో పాయ. ఆ పాయ దాటితే లంకలు. ఆ ఇసుక తిన్నె మీద పశువులన్నీ ఎక్కుతున్నాయి. మెత్తటి ఇసక మీద వందలాది పశుపాదాలు. ఆ వెనకాల మనుష్యుల అడుగులు. పాలేళ్ళ తడి అరికాళ్ళకి మెత్తటి ఇసుక తగుల్తుంటే గిలిగింతలు పెడ్తోంది. ఆ ఇసకపర్ర మీద ఎట్లా వచ్చిందో నల్లరేగడినేల. దాంట్లో జామతోటలు కాపలా కాసే మస్తాను గోగునారు చల్లాడు. ఆ ఎదుగుతున్న గోగుమొక్కల్ని ఎక్కడ తొక్కేస్తాయోనని జామతోటలోంచి 'ఓ హోహోయ్!' అని మస్తాన్ కేక. పాలేళ్ళు ఆ గోగు మొక్కలవైపు పోకుండా గొడ్లని మళ్ళించారు. రెండోపాయదాటి గొడ్లు లంకల్లో హాయిగా మేతకు పడ్డాయి. పాలేళ్ళు బువ్వ మూటలు పక్కకు పెట్టి చర్‌పట్టీ ఆడుకున్నారు. గాలిలో ఎగురుతున్న రెల్లుపూలలా ఎగిరెగిరి గంతులు పెట్టారు. ఎండ ఎక్కువయితే జామచెట్లకింద చేరి పులిజూదం ఆడారు. మధ్యాహ్నం వేళ బువ్వ మూటలు విప్పుకుని పచ్చళ్ళు పంచుకొంటూ హాయిగా భోంచేసి ఎవరో కొమ్మెక్కి పిల్లనగ్రోవి వూదుతుంటే వింటూ విశ్రాంతి తీసుకున్నారు. నాలుగ్గంటలవేళ మస్తాన్నడిగి మొక్కజొన్న చేలోంచి పది కండెలు విరుచుకొచ్చి పంచుకుతిన్నారు. గొడ్లన్నిటినీ మళ్ళేసుకుని ఇళ్ళకు బయల్దేరేవేళ పున్నయ్యగారి కర్రావు రాకుండా మొరాయించి గింగిరాలు తిరగటం మొదలెట్టింది. పాలేరు రాములు 'మిగిలిన వాళ్ళకి గొడ్లనప్పగించి నేను వస్తాలే మీరు పదండ న్నాడు. వాళ్ళు ముందుకు వెళ్ళిపోయారు.

కర్రావు ఈనమోపింది. తనచుట్టూ తనే గుండ్రంగా తిరుగుతూ కదంతొక్కుతోంది. "వారంరోజుల తర్వాత ఈనవలసిన ఆవు ఇప్పుడే ఈనదు కదా!" అని కంగారుపడ్డాడు రాములు. అలా తిరిగి తిరిగి కర్రావు ఈనమోపింది. వెనక్కాళ్ళు కిందకు వంచి కూర్చుంది. తన చిన్నారి అంత ఎత్తునుంచి కింద పడ్తుందేమోనని దాని భయం. వెనక రాములు పట్టుకునే ఉన్నాడు. దూడ నేలమీద పడ్డది. పడీ పడటంతోటే కళ్ళు తెరవని చిన్నారిని కర్రావు గబగబా నాకేస్తోంది. ఎక్కడలేని తమకం! తొందర! చకచక నాకేస్తోంది.

రాములికి ఏం తోచింది కాదు. రాత్రంతా ఆవునిక్కడే ఉంచితే వాతం కమ్ముతుందేమో! అవతలొడ్డుకు చేర్చటం ఎలా?

ఇవతలొడ్డున పున్నయ్యగారు కంగారు పడిపోతున్నాడు. కర్రావుని కన్న కూతుర్లా పెంచుకున్నాడు. పున్నయ్యకి ఆవు లంకలో ఈనిందని గట్టి నమ్మకం. వేణ్ణీళ్ళు పెట్టించాడు. మడ్డికూడు వండించాడు. కాని ఆవు ఇవతలొడ్డుకి ఎలా వస్తుంది?

కర్రావు మాయ వేసింది. అదృష్టవశాత్తు కునికినపాడు నుంచి అవతలొడ్డుకు వెళ్తున్న పడవ అటుగా వచ్చింది. సరంగును బతిమిలాడి ఆవుని దూడని అందులో కెక్కించాడు రాములు. ఆవు దూడని నాకుతూనే ఉంది. ఇవతలొడ్డు కొచ్చేసరికి వొడ్డున పున్నయ్య, మరో నలుగురు లాంతర్లతో ఎదురుచూస్తున్నారు.

ఒడ్డుకి రాగానే 'మా అమ్మో! మా అమ్మో!' అంటూ లేగదూడ నెత్తుకున్నాడు పున్నయ్య. కర్రావు దూడని, పున్నయ్యని మార్చి మార్చి నాకింది. సంబరంతో రంకెలు పెట్టింది.

కొట్టంలోకి తీసుకెళ్ళి పున్నయ్య వేణ్ణీళ్ళతో ఆవుని, దూడని స్వయంగా కడుగుతుంటే మున్సబొచ్చి చెప్పాడు. 'పున్నయ్యా! వ్యాజ్యంలో పల్లపీధి పొలం నీకే దక్కిందయ్యా!'

పున్నయ్య భార్య ఆనందంతో అంది. "గొడ్డొచ్చినవేళ ......"

పున్నయ్య గుండె పొంగిపోయి లేగదూడని గట్టిగా ముద్దెట్టుకున్నాడు.*